జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :49 శుక్రవారం 23-10-2026 పేజీలు:8 వెలరు 3 /—

https://www.epaperjournalistdiary.com/

మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం దక్కదు

- కాంగ్రెస్, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి విమర్శలు
- యమునా నది పునరుద్ధరణ పనుల కార్యక్రమంలో రాజకీయ వ్యాఖ్యలు
- బూత్ స్థాయి నుంచి ప్రధాని వరకు ప్రజలతో మమేకమవుతున్న బీజేపీ నేతలు
- ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ గాంధీ వైఖరిని తప్పుబట్టిన షా
- కోర్టుల తీర్పులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపణ
- యమునా కాలుష్యానికి గత ప్రభుత్వాలే కారణమని విమర్శ
- 2029 నాటికి యమునా నదిని ప్రక్షాళన చేయాలని లక్ష్యం
- పంజాబ్‌లో డ్రగ్స్ వ్యాపారం పెరిగిందంటూ ఆప్ ప్రభుత్వంపై ఆరోపణలు

ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ

- తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతా తెరిచిన కాంగ్రెస్ అగ్రనేత
- తన ఆత్మకథ తొలి రూపాన్ని పరిచయం చేసిన సోనియా
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పుస్తకం
- రాహుల్, ప్రియాంక ఖాతాలను వెంటనే ఫాలో అయిన సోనియా
- కాంగ్రెస్ పార్టీ ఖాతానూ అనుసరిస్తున్న పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్
- సోనియా ఖాతాను ఫాలో అవుతున్న రాహుల్‌తో పాటు సీనియర్ నేతలు
- నవంబర్ 10న పుస్తకాన్ని విడుదల చేయనున్న ప్రచురణ సంస్థ
- ప్రేమ, బాధ్యత, నష్టాలు, తనదైన గుర్తింపు ప్రయాణంపై ఆత్మకథ



ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు
నవంబర్ 1న పోలింగ్...

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- నవంబరు 3న ఓట్ల లెక్కింపు
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రంలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబరు 1న పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. కడప, రాజంపేట, మైదుకూరు, తిరుపతిల్లో ఈ నెల 23, 24వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. 25న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు

బీసీ కులగణనలో తప్పులుంటే
సరిచేస్తాం

వచ్చే కేబినెట్ భేటీలో కులగణన లెక్కలపై చర్చ

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలి
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తాం
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తాం
- పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తాం
- ట్యాంక్‌బండ్ సమీపంలో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు
- పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- రవీంద్రభారతిలో జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

బీసీ కులగణనలో తప్పులు దొర్లినా, అర్హుల వివరాలు నమోదు కాకపోయినా సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. జనాభా లెక్కల్లో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో కులగణన అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని, ఆ సామాజికవర్గ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సర్'కు వ్యతిరేకంగా
నేడు నిరసన

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రద్దు చేయాలని పిలుపు
- సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదికల నిర్ణయం
- 13.41 కోట్ల మంది ఓటుహక్కు పునరుద్ధరించాలని డిమాండ్
- జిల్లా, తహసీల్ కేంద్రాల్లో ఆందోళనలకు పిలుపు
- రాష్ట్ర రాజధానుల్లోనూ నిరసన కార్యక్రమాలు
- ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన
- శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని విజ్ఞప్తి



చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోంది..

- వైసీపీ అధినేత వైఎస్.జగన్ ఆరోపణ
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసంఎంత వరకైనా పోరాడదాం...
- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ

- ప్రధాని మోదీకి ఫోన్ చేసిన బెంజమిన్ నెతన్యాహు
- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవానికి రావాలని ఆహ్వానం
- భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి
- మోదీతో కలిసి టార్చ్ వెలిగించాలని నెతన్యాహు ఆకాంక్ష
- ఫోన్ సంభాషణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో వెల్లడించిన నేతలు
- ఉగ్రవాదంపై పోరులో ఇరు దేశాల భాగస్వామ్యంపై చర్చ
- భారత్--ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాలపై హర్షం
- మోదీతో భేటీకి సంబంధించిన ఫొటోను పంచుకున్న నెతన్యాహు

ఇజ్రాయెల్ స్వాతంత్ర్య వేడుకలకుమోదీకి ఆహ్వానం

డ్రైవింగ్ లైసెన్స్‌కు 75 శాతం మార్కులు తప్పనిసరి!

చంద్రబాబు నివాసానికి పవన్..

- 'పరిషత్ పోరు'పై కీలక 'మంతనాలు'!..
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ
- కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు
- వైసీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.
వైసీపీ రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై సుదీర్ఘ మంతనాలు
స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయలేకపోయిన వారికి మరో 48 గంటల సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు సూచించడమే ఈ ఆకస్మిక సమావేశానికి ప్రధాన కారణం. ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలో 19 మున్సిపాలిటీలతో పాటు జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై చంద్రబాబు, పవన్ లోతుగా చర్చించారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేస్తూనే, ఈ పరిణామాన్ని అవకాశంగా తీసుకుని వైసీపీ చేసే రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా

-మిగతా 2 లో

డిసెంబర్‌లో తెలంగాణకు
ప్రధాని మోదీ!

వరంగల్ కేంద్రంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

- రైల్వే తయారీ కేంద్రం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అంకితానికి ఏర్పాట్లు
- నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనకు అవకాశం
- హైదరాబాద్‌లో రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతల సమావేశం
- నవంబర్ 1న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ
- సమావేశానికి అధ్యక్షత వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ సహా ముఖ్యనేతల హాజరు
- ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పిలుపు

హైదరాబాద్:
తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన డిసెంబర్‌లో ఉండే అవకాశముందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. వరంగల్‌లోని రైల్వే తయారీ కేంద్రం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను జాతికి అంకితం చేసే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం. అంతకుముందు నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఈ పర్యటనల తేదీలు, కార్యక్రమాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

-మిగతా 2 లో

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

మరో 30 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం దక్కదు

-కాంగ్రెస్, రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి విమర్శలు
-యమునా నది పునరుద్ధరణ పనుల కార్యక్రమంలో రాజకీయ వ్యాఖ్యలు
-బూత్ స్థాయి నుంచి ప్రధాని వరకు ప్రజలతో మమేకమవుతున్న బీజేపీ నేతలు
-ఓటు చోరీ ఆరోపణలపై రాహుల్ గాంధీ వైఖరిని తప్పుబట్టిన షా
-కోర్టుల తీర్పులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపణ
-యమునా కాలుష్యానికి గత ప్రభుత్వాలే కారణమని విమర్శ
-2029 నాటికి యమునా నదిని ప్రక్షాళన చేయాలని లక్ష్యం
-పంజాబ్‌లో డ్రగ్స్ వ్యాపారం పెరిగిందంటూ ఆప్ ప్రభుత్వంపై ఆరోపణలు

న్యూఢిల్లీ
కాంగ్రెస్ పార్టీకి రాబోయే 30 ఏళ్లలోనూ దేశంలో అధికారం దక్కదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. గురువారం ఢిల్లీలో యమునా నది పునరుద్ధరణ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ రాజకీయాలు, ప్రతిపక్షాల వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు పార్టీ నేతలంతా ప్రజలతో మమేకమై ఉంటారని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తారని అమిత్ షా అన్నారు. ఓటు చోరీ ఆరోపణలతో రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తున్నారని, వారి ఓటు హక్కును కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికే పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన ఉనికిని కోల్పోయిందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కోర్టులు అనుకూలంగా తీర్పులు ఇస్తే న్యాయవ్యవస్థను ప్రశంసిస్తూ, ప్రతికూల తీర్పులు వస్తే ప్రశ్నించడం కాంగ్రెస్ వైఖరిగా ఉందని విమర్శించారు. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలతో ఢిల్లీ ప్రజల అభిప్రాయాలను మార్చలేరని అన్నారు యమునా నది కాలుష్యంపై మాట్లాడుతూ, గతంలో ఢిల్లీలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాలు వ్యర్థాలను నదిలోకి వదిలాయని ఆరోపించారు. హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చే కాలుష్య వ్యర్థాలు, మురుగునీరు కూడా నదిలో కలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఢిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. 2029 నాటికి యమునా నదిని శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో మాదకద్రవ్యాల వ్యాపారం విస్తరించిందని అమిత్ షా ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల పాలన, విధానాలపై విమర్శలు చేస్తూనే యమునా నది పునరుద్ధరణకు తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్, ఆప్ ప్రభుత్వాలపై చేసిన ఈ వ్యాఖ్యలు అమిత్ షా రాజకీయ విమర్శల్లో భాగంగా వెలువడ్డాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ..

న్యూఢిల్లీ
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ(రాశీఅఖు +ఖుఅన్షఘ) ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. గురువారం ఆమె సోషల్ మీడియా అకౌంట్ ఓపెన్ చేసి కొన్ని ఫోటోలు పోస్టు చేశారు. తన ఆత్మకథ బుక్‌కు చెందిన ఫస్ట్ లుక్‌ను ఆమె ఆ ఫోటోల్లో రిలీజ్ చేశారు. చాన్నాళ్ల తర్వాత ఆమె సోషల్ మీడియాలో మళ్లీ ప్రత్యక్షం అయ్యారు. ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత.. వెంటనే ఆమె రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ అకౌంట్లను ఫాలో అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌స్టా అకౌంట్‌ను కూడా ఆమె ఫాలో అవుతున్నారు. రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ కాంగ్రెస్ నేతలు అందరూ సోనియా ఇన్‌స్టా అకౌంట్‌ను ఫాలో అవుతున్నారు. సోనియాపై సీనియర్ నేతలు ప్రశంసలు కురిపించారు. బిలాంగింగ్.. ఏ జర్నీ ఆఫ్ లవ్ ఆత్మకథ బుక్ కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు

(మొదటి తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. నేడు, రేపు (22, 23 తేదీల్లో) కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

తెలంగాణలో తేలికపాటి జల్లులు

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.

బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం

-వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలి
-ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తాం
-ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తాం
-పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తాం
-ట్యాంక్‌బండ్ సమీపంలో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు
-పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
-రవీంద్రభారతిలో జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్
బీసీ కులగణనలో తప్పులు దొర్లినా, ఎవరి వివరాలైనా నమోదు కాకపోయినా సరిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తమ జనాభా తక్కువగా నమోదైందని భావించే కులాలవారు సంబంధిత వివరాలను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో కులగణన లెక్కలపై చర్చించి, అవసరమైన సవరణలు చేపడతామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసాన్ని తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి బీసీల జనాభా వివరాలను వెల్లడించామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని చెప్పారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంలో న్యాయపరమైన అవకాశాలను పరిశీలించేందుకు న్యాయ నిపుణులను సంప్రదించాలని ముదిరాజ్ నాయకులకు సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.తన పనితీరును ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై పరోక్ష విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, పని చేసే సత్తా ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ స్వాతంత్ర్య వేడుకలకు మోదీకి ఆహ్వానం

న్యూఢిల్లీ:
భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ చేసి, తమ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించారు. ఇటీవల విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ఇజ్రాయెల్ పౌరులను కాపాడేందుకు కీలక పాత్ర పోషించిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని, టార్చ్ వెలిగించాలని కోరారు. ఈ విషయాన్ని నెతన్యాహు సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ఈ ఆహ్వానంపై ప్రధాని మోదీ స్పందించారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానించినందుకు నెతన్యాహుకు ధన్యవాదాలు తెలిపారు. ఫోన్ సంభాషణలో తాజా పరిణామాలతో పాటు ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు వెల్లడించారు. నెతన్యాహు తన పోస్టులో మోదీని స్నేహితుడిగా పేర్కొంటూ, భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించినట్లు తెలిపారు. భారత్, ఇజ్రాయెల్ రెండు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోదీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నారు. ఇటీవల విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ధైర్యంగా వ్యవహరించి ఇజ్రాయెల్ పౌరులను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌ను కూడా వేడుకలకు ఆహ్వానించినట్లు నెతన్యాహు తెలిపారు. మోదీతో కలిసి ఆయన టార్చ్ వెలిగించే కార్యక్రమంలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కాగా, ప్రధాని మోదీ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. తాజా ఆహ్వానం ఇరు దేశాల మధ్య సంబంధాల ప్రాధాన్యాన్ని మరోసారి చాటింది.

డిసెంబర్‌లో తెలంగాణకు ప్రధాని మోదీ!

(మొదటి తరువాయి)

హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలు కూడా హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోకి వెళ్లే అంశాలపై చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని నేతలు భావిస్తున్నారు. వివిధ రాజకీయ సంస్థల వైఖరిని వ్యతిరేకిస్తూ పాదయాత్ర నిర్వహించే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, గుంపు రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని రామచందర్‌రావు పిలుపునిచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తమ నిరసనను తెలియజేయాలని నేతలకు సూచించినట్లు సమాచారం. ప్రధాని మోదీ, అమిత్ షా పర్యటనలపై అధికారిక షెడ్యూల్ వెలువడిన తర్వాత కార్యక్రమాలపై మరింత స్పష్టత రానుంది.

సర్‌'కు వ్యతిరేకంగా నేడు నిరసన

-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
-ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రద్దు చేయాలని పిలుపు
-సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదికల నిర్ణయం
-13.41 కోట్ల మంది ఓటుహక్కు పునరుద్ధరించాలని డిమాండ్
-జిల్లా, తహసీల్ కేంద్రాల్లో ఆందోళనలకు పిలుపు
-రాష్ట్ర రాజధానుల్లోనూ నిరసన కార్యక్రమాలు
-ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన
-శుక్రవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--సర్)కు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా, పీపుల్ ఎగనెస్ట్ ఎస్ఐఆర్ వేదిక పిలుపునిచ్చాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. సర్ ప్రక్రియలో ఓటుహక్కు కోల్పోయినట్లు పేర్కొంటున్న సుమారు 13.41 కోట్ల మంది పౌరుల ఓటుహక్కును పునరుద్ధరించాలని ఆ వేదికలు కోరాయి. ఈ డిమాండ్లతో దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపాయి. శుక్రవారం అన్ని జిల్లా, తహసీల్ కేంద్రాలతో పాటు రాష్ట్ర రాజధానుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించాలని కోరాయి. సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు అంశాలపై తమ నిరసనను తెలియజేయడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని పేర్కొన్నాయి.

డ్రైవింగ్ లైసెన్స్‌కు 75 శాతం మార్కులు తప్పనిసరి!

న్యూఢిల్లీ, అక్టోబర్ 22
ఆధార్ ధృవీకరణ ద్వారా పూర్తిచేసే కొన్ని ఆన్‌లైన్ డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపుతో పాటు సురక్షిత డ్రైవింగ్ శిక్షణ మదింపు కోసం అర్హత పరిమితిని(పాస్ మార్కులు) 60 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. ప్రతిపాదిత మార్పుల లక్ష్యం డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు మదింపు అర్హతలను కఠినతరం చేయడమేనని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.సురక్షిత డ్రైవింగ్‌కు సంబంధించిన శిక్షణ కనీసం 30 నిమిషాలపాటు ఉండాలని కేంద్ర మోటర్ వాహనాల నిబంధనలకు ప్రతిపాదించిన సవరణల ముసాయిదాలో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ ప్రతిపాదన ప్రకారం లైసెన్సింగ్ అధికారులు పేరు, చిరునామాతో సహా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను మార్చడానికి చేసే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలు సహా తెలియచేస్తూ 15 రోజుల్లోపు ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. అలాగే దరఖాస్తుదారుని పేరు, చిరునామా సహా వ్యక్తిగత వివరాల్లో మార్పులు చేసేందుకు విధించే రుసుములను తొలగించాలని కూడా ముసాయిదాలో ప్రతిపాదించారు. దరఖాస్తుదారులు తమ గుర్తింపు, వయస్సు, నివాస ధృవీకరణ కోసం ఉపయోగించే పత్రాలను కూడా ముసాయిదా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి

చంద్రబాబు నివాసానికి పవన్..

(మొదటి తరువాయి)

మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది.

పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా...

ఈ భేటీలో ముఖ్యంగా పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా నిలిచాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి అభ్యర్థుల మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ఒక అవగాహనకు వచ్చారు. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ సృష్టించిన నాటకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి, గ్రామ స్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకుంటూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేశారు.

వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధం

డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ కేవలం పార్టీ పనుల కోసమే ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో అధికారిక హంగుల కన్నా, పక్కా వ్యూహంతో ముందుకు సాగడమే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పవన్ తన శ్రేణులకు పంపించారు. ఈ భేటీ ద్వారా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధంగా ఉందని చంద్రబాబు, పవన్ స్పష్టం చేశారు. రానున్న 48 గంటల్లో ఎస్ఈసీ తీసుకునే నిర్ణయం, తదుపరి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకం కానున్నాయి

లైఫ్‌గార్డ్ కోర్సుపై అనుమానాలెన్నో!

ధ్రువపత్రాల చెల్లుబాటుపై స్పష్టత ఏదీ?

అనుమతులు ఉన్నాయా? గుర్తింపు ఉందా? ఉద్యోగాలకు అర్హత కల్పిస్తాయా?

అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు.. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్, ప్రతినిధి
తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రెటరీ ఉమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన లైఫ్‌గార్డ్, వాటర్ సేఫ్టీ శిక్షణ కోర్సు నిర్వహణపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కోర్సుకు అవసరమైన అనుమతులు, శిక్షణ అనంతరం జారీ చేసిన ధ్రువపత్రాల చెల్లుబాటు, వాటి ఆధారంగా ఉద్యోగాలు పొందే అర్హతపై స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్, స్విమ్మింగ్ ఫెడరేషన్ వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది మే 1 నుంచి 3వ తేదీ వరకు హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఆక్వాటిక్ స్టేడియం ప్రాంగణంలోని ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో ఈ కోర్సు నిర్వహించినట్లు సమాచారం. అయితే, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంబంధిత సంస్థలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అభ్యర్థులకు అందించిన ధ్రువపత్రాలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆమోదిస్తాయా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.

లైఫ్‌గార్డ్, వాటర్ సేఫ్టీ కోర్సును నిర్వహించేందుకు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్‌కు నిబంధనల ప్రకారం అర్హత ఉందా? స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ముందస్తుగా లిఖితపూర్వక అనుమతి తీసుకున్నారా? సంబంధిత నిర్వహణ కమిటీ ఆమోదం పొందారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. కోర్సు నిర్వహణకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, అనుమతి పత్రాలు, గుర్తింపు వివరాలను బహిర్గతం చేస్తే అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలకు తెరపడే అవకాశం ఉంది.

ఈ కోర్సు ద్వారా జారీ చేసిన ధ్రువపత్రాలకు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉందా? ఇతర సంస్థల పేర్లు లేదా గుర్తింపులను ప్రస్తావించినట్లయితే, అందుకు సంబంధించిన అధికారిక ఆధారాలేమిటి? ఈ ధ్రువపత్రాలను ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థలు ఉద్యోగ నియామకాల్లో అర్హతగా పరిగణిస్తాయా? అనే ప్రశ్నలకూ సమాధానాలు ఇవ్వాల్సి ఉంది.

కోర్సు నిర్వహణకు అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాల గుర్తింపుపై స్పష్టత లేకపోవడంతో శిక్షణ పొందిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము కష్టపడి సమయం కేటాయించడంతోపాటు డబ్బు వెచ్చించి శిక్షణ పొందామని, ఇప్పుడు ధ్రువపత్రాల చెల్లుబాటుపై సందేహాలు తలెత్తడం తమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని వాపోతున్నారు. అధికారికబ గుర్తింపు లేని ధ్రువపత్రాలు తమకు అందాయేమోనన్న ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధానంగా రాష్ట్రంలో ఈత, డైవింగ్, వాటర్ పోలో క్రీడలను ప్రోత్సహించడం, పోటీలు నిర్వహించడం, క్రీడాకారుల ఎంపిక చేపట్టడం, జాతీయ, జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవడం వంటి బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది అయితే, ఈ క్రీడా కార్యకలాపాల నిర్వహణ, నియంత్రణకు సంబంధించిన బాధ్యతలకు భిన్నంగా లైఫ్ సేవింగ్, వాటర్ సేఫ్టీ శిక్షణా కోర్సులను నిర్వహించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సదరు కోర్సులను నిర్వహించేందుకు అసోసియేషన్‌కు ఏ మేరకు అధికారం ఉంది? సంబంధిత శాఖల అనుమతులు, గుర్తింపు ఉన్నాయా? కోర్సు నిర్వహణకు అనుసరించాల్సిన నిబంధనలు ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

లైఫ్ సేవింగ్, వాటర్ సేఫ్టీ శిక్షణ అనేవి ప్రజల ప్రాణరక్షణతో ముడిపడిన కీలకమైన అంశాలు. ఈ కోర్సులను నిర్వహించే సంస్థలకు తగిన గుర్తింపు, శిక్షణా ప్రమాణాలు, ధ్రువపత్రాల జారీకి సంబంధించిన అధికారాలు ఉండటం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో, సంబంధిత రంగంలో గుర్తింపు పొందిన సంస్థల అనుబంధం లేదా అనుమతి లేకుండా ఇటువంటి కోర్సులు నిర్వహించినట్లయితే, వాటి చట్టబద్ధతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది.

తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యవర్గ నిర్వహణ కల్పనపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసోసియేషన్‌లోని కమిటీ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, కార్యదర్శి ఉమేష్ తనకు అనుకూలంగా ఉన్న కొందరు సభ్యులతోనే వ్యవహారాలను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా స్థాయిలోనూ స్విమ్మింగ్ అసోసియేషన్ లో అర్హత ఉన్న వారిని పక్కన పెట్టి, స్విమ్మింగ్ తోసంబంధం లేని వారికి సైతం ముడుపులు చెల్లిస్తే బ్యాక్ డోర్ పద్ధతిలో అఫియేషన్ ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లైఫ్‌గార్డ్, వాటర్ సేఫ్టీ కోర్సును నిర్వహించేందుకు స్కిల్ ఇండియాతో అనుబంధం కలిగిన రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ లేదా నోబుల్ లైఫ్ సేవింగ్ సొసైటీ వంటి సంస్థల గుర్తింపు అవసరమని పేర్కొంటున్న నేపథ్యంలో, ఈ అంశంపై సంబంధిత అధికారులు, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ స్పష్టత ఇవ్వాలి. కోర్సు నిర్వహణకు ఉన్న అధికారిక అనుమతులు, గుర్తింపు వివరాలు, శిక్షణా విధానం, సర్టిఫికెట్ల చెల్లుబాటు, వాటి ఆధారంగా ఉద్యోగాలకు ఉండే అర్హత వంటి అంశాలను బహిర్గతం చేయాలి. అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. శిక్షణ పేరుతో యువత సమయం, డబ్బు వృథా కాకుండా సంబంధిత క్రీడా సంస్థలు, ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఫెడరేషన్ జోక్యం చేసుకోవాలిఈ వ్యవహారంపై స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జోక్యం చేసుకుని, కోర్సు నిర్వహణకు సంబంధించిన అనుమతులు, గుర్తింపు, ధ్రువపత్రాల చెల్లుబాటుపై సమగ్ర విచారణ జరపాలని అభ్యర్థులు కోరుతున్నారు. కోర్సు నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ధ్రువపత్రాలకు గుర్తింపు లేకపోవడం వల్ల అభ్యర్థులు నష్టపోయినట్లు నిర్ధారణ అయితే, వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశాన్ని సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, కోర్సు నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను బహిరంగపరచాలని వారు కోరుతున్నారు. అనుమతులు, గుర్తింపు, ఉద్యోగ అర్హతపై అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ వ్యవహారంపై నెలకొన్న సందిగ్ధత తొలగి, శిక్షణ పొందిన అభ్యర్థులకు భరోసా లభించనుంది.

బోరు పారుతుందా.. పంటలకు నీరు అందుతుందా..?

షాద్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి విద్యుత్ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న షాద్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫరూక్‌నగర్ మండలం దూసకల్, వెలిజర్ల గ్రామాల్లో విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి గురువారం పర్యటించి విద్యుత్ సరఫరా పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా పంట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి విద్యుత్ సరఫరా, బోర్ల పనితీరు, పంటలకు సాగునీటి అందుబాటు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయా.. బోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా.. పంట చేలకు నీరు అందుతుందా.. అల్పవోల్టేజీ సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అంటూ రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అదనంగా మూడు గంటల విద్యుత్ సరఫరా అందిస్తున్న నేపథ్యంలో పంట పొలాల పరిస్థితి ఎలా ఉందనే విషయాలను రైతులతో చర్చించారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును పరిశీలించడంతోపాటు అల్పవోల్టేజీ సమస్యలు, ఇతర విద్యుత్ ఇబ్బందులపై ఆరా తీశారు. రైతులకు విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని డీఈ శ్యాంసుందర్ రెడ్డి సూచించారు. సమస్యలను గుర్తించిన వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ పర్యటనలో విద్యుత్ శాఖ గ్రామీణ విభాగం సహాయ ఇంజినీర్ షణ్ముఖ రెడ్డి పాల్గొన్నారు.'

పేదల పెన్నిధి పండుగ సాయన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ);
ప్రజావీరుడు,తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని సాయన్న విగ్రహానికి పూలమాల వేసి,నాటి నిరంకుశ పాలనలో భూస్వాములు,పెత్తందారుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన సాయన్న ధైర్యసాహసాలను కొనియాడారు. పేదల ఆకలి తీర్చిన మానవతావాది సాయన్న అని ప్రశంసించారు. పాలమూరు గడ్డపై రగిలిన ఆయన పోరాట జీవితం జానపదుల గుండెల్లో నేటికీ సజీవంగా ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం సాయన్న చేసిన పోరాటాలను, ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్స్ కానుగు అనంతయ్య,చింటూ ప్రతాప్ రెడ్డి, నందకిషోర్,చిన్న యాదగిరి,పాలమాకుల చెన్నయ్య,ముదిరాజ్ సంఘం నాయకులు మంగ వెంకటేష్,అంచె రాములు,అందె పైలయ్య, చెట్ల వెంకటేష్,మేకల వెంకటేష్, బాలరాజ్,దినేష్ సాగర్,మంగ మధు, మల్లేష్,యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

పరిగి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండెపల్లి రామకృష్ణారెడ్డి



జర్నలిస్ట్ డైరీ,పరిగి అక్టోబర్ 22
ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శంషాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పరిగి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండెపల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి నాయకత్వంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అత్యంత కీలకమైనవని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావంతులు, నిరుద్యోగుల కోసం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రతి పట్టభద్రుడికి వివరిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి, అర్హులైన పట్టభద్రులందరినీ కలిసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయించేలా సమష్టిగా కృషి చేస్తామన్నారు. పరిగి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజారిటీ అందించి విజయకేతనం ఎగురవేస్తామని రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా బహుజన విప్లవ వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు

షాద్‌నగర్ లో పండుగ సాయన్న విగ్రహానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాళి

షాద్ నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
సంఖ్యాపరంగా బలమైన ముదిరాజ్ సమాజం రాజకీయంగా చైతన్యవంతమై, ఏకతాటిపైకి వచ్చినప్పుడే సముచిత ప్రాతినిధ్యం మరియు ఆశించిన హక్కులు సాధ్యమవుతాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బహుజన పోరాట యోధుడు, నిరుపేదల ఆశాజ్యోతి పండుగ సాయన్న జయంతి వేడుకలను పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు. ముదిరాజ్ సంఘం పెద్దలు అందే బాబయ్య, మంగ వెంకటేష్, అంచే రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ ముదిరాజ్, అంబటి ప్రభాకర్, బుడ్డ నరసింహులు, బుద్దుల జంగయ్య, కావలి శ్రీశైలం, శ్రీధర్ వర్మ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, ఆనాటి సంస్థానాధీశులు, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి, అణగారిన వర్గాల ఆకలి తీర్చడానికి తన ప్రాణాలనే పణంగా పెట్టిన వీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. సమాజం కోసం సర్వస్వం త్యాగం చేసిన ఇటువంటి మహనీయుల చరిత్రను మరుగున పడనీయకుండా భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

రాజకీయ ఐక్యత లోపిస్తే అవకాశాలు దూరం:

ముదిరాజ్ వర్గానికి జనాభా పరంగా గణనీయమైన బలం ఉన్నప్పటికీ, రాజకీయ చైతన్యం లేకపోవడం, చిన్నచిన్న ప్రలోభాలు, తాయిలాలకు లొంగిపోయి చీలిపోవడం వల్లే రాజకీయంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసంగాల మాయలో పడకుండా, స్వార్థాన్ని వీడి సమాజ హితం కోసం అంతా ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. "హక్కులను ఎవరూ చేతుల్లో పెట్టరు, మన బలాన్ని ప్రదర్శించి సాధించుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

ముదిరాజుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ముదిరాజ్ సమాజానికి కేబినెట్ స్థాయి మంత్రి పదవి కల్పించాలనే డిమాండ్‌తో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధించి గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కుల వర్గీకరణ తదితర అంశాల్లో న్యాయపరమైన ప్రక్రియలు ముడిపడి ఉన్నందున, తగిన సమయం చూసి సీఎం వద్దకు తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి గట్టిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజ్ సామాజికవర్గం ఏ పార్టీలో ఉన్నప్పటికీ తమ జాతి ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముదిరాజుల సంక్షేమానికి అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనుర్ బసవేశ్వర్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్,సింగిల్ విండో చైర్మెన్ అంబటి ప్రభాకర్ ముదిరాజ్,ముదిరాజ్ సంఘం నేతలు అందే బాబయ్య ముదిరాజ్,మంగ వెంకటేష్ ముదిరాజ్,సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, అంచే రాములు , కనుగు అంతయ్య, బుడ్డ నర్సింహులు,మంగ మధు,మంగ అశోక్, తుమ్మల గోపాల్, సంతోష్ కుమార్, శ్రీధర్ వర్మ, పసుపుల ప్రశాంత్ ముదిరాజు, మాజీ ఎంపీటీసీ కావాలి శ్రీశైలం, బిమారం లక్ష్మయ్య, తంగెడ్ పల్లి శంకర్, నిరటీ వాసు, జగదీష్, గుల్లే కృష్ణయ్య, యాదయ్య ముదిరాజ్,అందే పైలయ్య , మేకల వెంకటేష్, భరత్, ప్రదీప్ ముదిరాజ్, జగదీష్ ముదిరాజు, శ్రీనివాస్ ముదిరాజ్, వెంకటేష్ , షాద్ నగర్ మున్సిపల్ కౌన్సిలర్ల రాజు నాయక్, పెంటయ్య, కాంగ్రెస్ ఎస్సీ విభాగం నియోజకవర్గం చైర్మెన్ జాంగారి రవి,కాంగ్రెస్ నాయకులు లింగారెడ్డి గూడ ఉప సర్పంచ్ అశోక్, అప్పారెడ్డీ గూడ సీతారాం, ముదిరాజ్, జేఏసీ నేతలు జనార్ధన్, రిటైర్డ్ తహశీల్దార్ సరాపు జగదీశ్వర్,టెలిఫోన్ వెంకటయ్య, రాము, మరియు ముదిరాజు సంఘం నేతలు, నాయకులు, పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి...

-జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత.

-ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.హెచ్. శ్రీధర్‌కు ఎన్నికల ఏర్పాట్లను వివరించిన కలెక్టర్

-పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సమగ్ర సౌకర్యాలు

-సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత

మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ మార్కాపురం జిల్లా పరిధిలో ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత స్పష్టం చేశారు.?గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి మరియు మార్కాపురం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సి.హెచ్. శ్రీధర్‌కు జిల్లాలోని ఎన్నికల సన్నాహాలను కలెక్టర్ సమగ్రంగా వివరించి, సమీక్షించారు. ఈ సందర్భంగా
రొజిల్లా లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సిబ్బందిని కేటాయించామని, బ్యాలెట్ పెట్టెల లభ్యత, వాటి పనితీరు మరియు భద్రతను తనిఖీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఓటు వేయడానికి వచ్చే ప్రజలు, వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, నీడ కోసం షామియానాలు, ర్యాంప్ వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి

జిల్లా పరిధిలోని సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ అదనపు పోలీస్ బలగాలు, వెబ్‌కాస్టింగ్ మరియు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు జరిగే కౌంటింగ్ కేంద్రాల వద్ద బహుళ అంచెల భద్రత మరియు నిరంతర సీసీటీవీ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాలపై ఎప్పటికప్పుడు స్పందించి తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.
ఎన్నికల సాధారణ పరిశీలకులు? సి.హెచ్. శ్రీధర్ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగా సాగేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా, డిఆర్ఓ శ్రీదేవి, డిపిఓ కుప్పిలి ఫణీంద్ర, మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. కంచి బాబు తదితరులు పాల్గొన్నారు.

కమ్మదనం మిషన్ భగీరథ సంపు వద్ద పైప్‌లైన్, మోటార్ల మరమ్మతు పనుల పరిశీలన

-పనులు త్వరగా పూర్తి చేసి షాద్‌నగర్ పట్టణానికి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

- మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని షాద్‌నగర్ పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కమ్మదనం గ్రామంలోని మిషన్ భగీరథ సంపు వద్ద పైప్‌లైన్, మోటార్ల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ సి. పెంటయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మరమ్మతు పనులు జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పైప్‌లైన్, మోటార్ల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి, నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురుకాకుండా మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ మజే మిల్, మున్సిపల్ ఏఈ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత యనమలకు అస్వస్థత.. ఆరోగ్య పరిస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా

-కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు

-ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని పార్టీ నేతలకు చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారు. యనమల కుటుంబ సభ్యులు, ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. యనమలకు అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యనమల రామకృష్ణుడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని పార్టీ ముఖ్య నేతలను చంద్రబాబు ఆదేశించారు. యనమల అస్వస్థతకు గల కారణాలు, ఆయన ఆరోగ్య స్థితికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

పండుగ సాయన్న స్ఫూర్తితో లక్ష సంతకాల మహోద్యమం

- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలంటూ డిమాండ్

-షాద్‌నగర్‌లో సంతకం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పండుగ సాయన్న స్ఫూర్తితో లక్ష సంతకాల మహోద్యమం' కార్యక్రమం షాద్‌నగర్‌లో ఉత్సాహంగా కొనసాగింది. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంతకం చేసి సంతకాల మహోద్యమానికి తన మద్దతును తెలిపారు. రైతాంగ ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు.
ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు మీడియా ప్రతినిధులు జర్నలిస్టు కేపీ, శరత్ తదితరులు సంతకాలు చేశారు. ముదిరాజ్ నేతలు అందె బాబయ్య, అందె మోహన్, అంచె రాములు తదితరులు, వివిధ వర్గాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతకాలు చేశారు.
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, పి.ఆర్.ఎల్.ఐ. పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించడం, నిర్వాసితులకు పునరావాసం, పునరావాస ప్యాకేజీలను సక్రమంగా అమలు చేయడం, పాత సాగునీటి ప్రాజెక్టులను పూర్తి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపట్టడం వంటి అంశాలను జేఏసీ ప్రధానంగా ప్రస్తావించింది.
అలాగే డిండి లిఫ్ట్ పనుల విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని, కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణ జిల్లాల మధ్య పారదర్శకత పాటించాలని జేఏసీ డిమాండ్ చేసింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చంద్రసాగర్--అప్పారావుపేట్ లిఫ్ట్ ఏర్పాటు, బల్మూరు మండల రైతాంగానికి సాగునీటి సౌకర్యం, వెల్లూరు--గొందిమళ్ల బ్యారేజీ నిర్మాణం తదితర డిమాండ్లను కూడా ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలని కోరింది. లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సేకరించిన లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేసి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా చైర్మన్ సత్యనారాయణ, కర్ణకోట రవీంద్రనాథ్, మందారం నరసింహులు, బుద్దుల జంగయ్య తదితరులు మాట్లాడుతూ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. ప్రజల నుంచి వస్తున్న సంతకాలు ఉద్యమానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని, ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.'

స్థానిక ఎన్నికలు నిలిపి వేయండి...
అధికారులకు పోలవరం వాసుల వినతి

-పంచాయతీల సరిహద్దులపై ప్రత్యేక గెజిట్ జారీ చేయాలని వినతి

-విలీనంతో గ్రామాల్లో గందరగోళం నెలకొందని గ్రామస్థుల ఆవేదన

-అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన వివిధ పార్టీల నేతలు

పోలవరం, ఏలూరు, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : స్థానిక సంస్థల ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని, పంచాయతీలు, ఎంపీటీసీ నియోజకవర్గాల సరిహద్దులపై స్పష్టతనిస్తూ ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీ పేట వాసులు, ఇతర నిర్వాసితులు బుధవారం పోలవరం ఆర్డీవో ఎం.వి. రమణ, తహసీల్దార్ బి. సాయిరాజుకు ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు.
విలీనంతో గ్రామాలు విచ్ఛిన్నమయ్యాయని ఆవేదన
కొంద్రుకోట, తూటిగుంట, కొరుటూరు, పైడిపాక, దేవరగొంది వంటి గ్రామ పంచాయతీలను ఎల్ఎన్‌డీ పేట, రెడ్డి గణపవరం, పి. అంకంపాలెం, ఇటుకలకోట, పోలవరం పంచాయతీలలో విలీనం చేయడం వల్ల తమ గ్రామాలు విచ్ఛిన్నమయ్యాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలీన ప్రక్రియ కారణంగా స్థానిక ప్రాతినిధ్యం, గ్రామసభల నిర్వహణ, గిరిజన హక్కుల విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు వాపోయారు.
సమస్యను పరిష్కరించకుండా ఎన్నికలు నిర్వహించవద్దు
ఈ సమస్యను పరిష్కరించకుండా ఎన్నికలు నిర్వహించడం సమంజసం కాదని, ముందుగా తమ గ్రామాల పరిధిని స్పష్టంగా నిర్దేశిస్తూ ప్రత్యేక గెజిట్ జారీ చేసిన తర్వాతే ఎన్నికలు జరపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పైడా నాగరాజు, కొవ్వాసి శ్రీనివాసరావు, గోపాల్‌తో పాటు టీడీపీ నేతలు గుబ్బ రాంబాబు, ఇళ్ల సత్యనారాయణ, కొల్లేపర వేణుగోపాల్, చిక్కాల రాంబాబు, బీజేపీ నేత మోటు అయ్యప్ప, వైసీపీ నేతలు ఇళ్ల కళ్యాణ్, బాపిరాజు, పీసీ కమిటీ సభ్యులు మోడియం సింహాచలం, మూలం శ్రీనివాసరావు, తామా రాజు తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోంది...వైసీపీ అధినేత వైఎస్.జగన్ ఆరోపణ

-ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎంత వరకైనా పోరాడదాం...

-వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ

-స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ

తాడేపల్లి, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారన్న జగన్

"చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ కార్యకర్తలు,నాయకులు ధైర్యంగా ముందడుగు

క్షేత్ర స్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయ పోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు

స్థానిక ఎన్నికలు ఆపేందుకు వైసీపీ హింసాత్మక కుట్ర..
ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

-స్థానిక ఎన్నికలను హింసతో అడ్డుకోవాలని వైసీపీ కుట్ర

-ఎన్నికలు ఆగితే రాష్ట్రానికి రూ.12,500 కోట్ల నిధులు నష్టం

-పక్క రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను రప్పించి అరాచకాలు

-సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరిస్తూ వైసీపీ తప్పుడు ప్రచారం

-నామినేషన్ల గణాంకాలు బయటపెట్టి వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన పట్టాభి

మంగళగిరి,అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకోవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందని, అందుకే దాడులు, అరాచకాలకు పాల్పడుతోందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రంగా ఆరోపించారు. సకాలంలో ఎన్నికలు పూర్తి చేయకపోతే 16వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.12,500 కోట్ల నిధులు శాశ్వతంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

భయానక వాతావరణం సృష్టిస్తున్నారు...

సీఎం చంద్రబాబు కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే, దానిని అడ్డుకునేందుకు వైసీపీ యత్నిస్తోందని పట్టాభిరామ్ విమర్శించారు. "పంజాబ్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను, షార్ప్ షూటర్లను రప్పించి పుంగనూరు, కడప, రాయచోటి వంటి ప్రాంతాల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేయడానికి వచ్చిన వృద్ధురాలిపై దాడి చేసి పత్రాలు లాక్కోవడం వైసీపీ రాక్షసత్వానికి నిదర్శనం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నామినేషన్లు అడ్డుకుంటోందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు

ప్రభుత్వం నామినేషన్లు అడ్డుకుంటోందని వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, గణాంకాలే దీనికి నిదర్శనమని పట్టాభిరామ్ అన్నారు. "ఎంపీటీసీ ఎన్నికల్లో తొలిరోజే వైసీపీ తరఫున 1,918 నామినేషన్లు పడ్డాయి. జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ (128) కన్నా ఎక్కువగా వైసీపీ (192) నామినేషన్లు దాఖలు చేసింది. మేమే అడ్డుకుంటే ఇన్ని నామినేషన్లు ఎలా వేశారు?" అని ఆయన ప్రశ్నించారు. 2020-21లో వైసీపీ పాలనలో 25 శాతం ఎంపీటీసీ, 20శాతం జెడ్పీటీసీ స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేశారని, తన ప్రాణాలకు రక్షణ కావాలని నాటి ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

ఈసీ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది

సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం వక్రీకరిస్తూ ఎన్నికలు వాయిదా పడ్డాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని పట్టాభిరామ్ మండిపడ్డారు. పిటిషనర్ల వినతిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని మాత్రమే ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఆ ఆర్డర్ కాపీని ఆయన మీడియాకు చూపించారు. ఈసీ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం గౌరవిస్తుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరిస్తూ, "పీకలు కోస్తాం" అంటూ బెదిరించిన వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డిపై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి గొడ్డలి పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు

తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ..
6 గంటల్లోనే శ్రీవారి సర్వదర్శనం

-తిరుమలలో గణనీయంగా తగ్గిన భక్తుల రద్దీ

-ప్రస్తుతం 12 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు

-సర్వదర్శనం 6 గంటల్లో పూర్తి

-బుధవారం శ్రీవారిని దర్శించుకున్న 73 వేల మంది భక్తులు

-హుండీ ద్వారా రూ. 2.66 కోట్ల ఆదాయం

తిరుమల,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గింది. గత కొన్ని రోజులుగా కొనసాగిన రద్దీకి భిన్నంగా, ప్రస్తుతం కొండపై ప్రశాంత వాతావరణం నెలకొంది. దీంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా శ్రీవారిని దర్శించుకుంటున్నారు.

సర్వదర్శనానికి 6 గంటల సమయం

గురువారం ఉదయం నాటికి భక్తులు కేవలం 12 కంపార్ట్‌మెంట్లలో మాత్రమే శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సాధారణంగా వారాంతాల్లో, పర్వదినాల్లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయి, వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లు కనిపిస్తాయి. అయితే, ప్రస్తుతం రద్దీ తక్కువగా ఉండటంతో భక్తులకు నిరీక్షణ సమయం బాగా తగ్గింది.టైమ్ స్లాట్ టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

బుధవారం రూ. 2.66 కోట్ల ఆదాయం

ఇక బుధవారం (అక్టోబర్ 21) నాడు శ్రీవారిని దర్శించుకున్న భక్తుల వివరాలను టీటీడీ విడుదల చేసింది.బుధవారం ఒక్కరోజే 73,226 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 24,754 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ. 2.66 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 3.63 లక్షల లడ్డూలను విక్రయించగా, 1.58 లక్షల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. తిరుమల లోని అశ్విని ఆసుపత్రిలో 2,217 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ పేర్కొంది.

ఎల్-నినోను ఎదుర్కోవాలంటే పంటల మార్పు తప్పనిసరి

-షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి

-వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతలో మార్పులు, వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు పంటల ప్రణాళికతో సాగు చేపట్టాలని షాద్‌నగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రమాదేవి సూచించారు. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించేందుకు యాసంగిలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు.

ఫరూక్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతు పెంబళ్ల శ్రీధర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సాగు పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పంటల సాగు విధానాలను పరిశీలించి రైతుకు పలు సూచనలు చేశారు. రైతు శ్రీధర్ తనకున్న నాలుగున్నర ఎకరాల భూమిలో ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనల మేరకు వరి సాగుకు బదులుగా రెండున్నర ఎకరాల్లో తుంపర సేద్యం పద్ధతిలో బెండకాయ, టమాట పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన రెండు ఎకరాల్లోనూ తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలు సాగు చేసేందుకు భూమిని సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పు దిశగా రైతు తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమాదేవి మాట్లాడుతూ రబీ జొన్న, కుసుమ, పెసర, మినుములు, సజ్జలు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూమి స్వభావం, నేల రకం, నీటి లభ్యతతో పాటు మార్కెట్‌లో పంటలకు ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. నీటి పొదుపుతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకుని స్థిరమైన దిగుబడులు సాధించేందుకు సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. పంటకు అవసరమైన నీటిని మాత్రమే అందించే బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి విధానాలను అవలంబించాలని, ఉద్యానవన శాఖ ద్వారా అర్హత మేరకు సబ్సిడీపై లభించే బిందు సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పంటల మార్పుతో పాటు నేలలో తేమను సంరక్షించే పద్ధతులు పాటించడం, నీటిని వృథా కాకుండా వినియోగించడం, సాగు ఖర్చులను నియంత్రించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రమాదేవి తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుంటూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్, ఉద్యానవన అధికారి హిమబిందు, కాటన్ సీపీఓ తిరుమలరావు, ఏఎంసీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీశైలం, ఏఈఓ రాంబాబు, హెచ్ఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాల్వ నిర్మాణం పనులను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదు బండ లోని కుడికుంట చెరువు అలుగు నుండి మసీదు బండ ప్రభుపాద లే ఔట్ కాలనీ వరకు రూ. 4 కోట్ల రూపాయల అంచనావ్యయంతో జరుగుతున్న వరద నీటి కాల్వ నిర్మాణం పనులను పరిశీలించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మసీదు బండ లోని ప్రభు పాద లే ఔట్ కాలనీ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, సుమారుగా 4 కోట్ల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపుకు గురి అవుతుంది అని ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలుంను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు తెలియచేశారు

కుడి కుంట చెరువు ఔట్ లెట్ నుండి నీటి ప్రవాహం అధిక మొత్తంలో వస్తుంది కావున చెరువు ఔట్ లెట్ ను పరిగణలోకి తీసుకోవాలని, మళ్ళీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనుల పై అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలియచేశారు.

అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, వరద నీటి కాల్వ నిర్మాణం పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది.

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని , అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

టీడీపీకి షాక్.. వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి..

-శ్రీకాకుళం జిల్లాలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ
-జగన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే
-40 ఏళ్ల సేవకు తెలుగుదేశం పార్టీలో అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన
-భర్త విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని టీడీపీపై తీవ్ర ఆరోపణలు
-ప్రజలకు మంచి చేయాలనే వైసీపీలో చేరానని వెల్లడి

తాడేపల్లి, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
టీడీపీకి శ్రీకాకుళం జిల్లాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరారు. గురువారం తాడేపల్లి లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.

టీడీపీలో చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయిఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీకి సేవలందించిందని, కానీ చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినా అన్నీ కోల్పోయామని వాపోయారు.

తన భర్త, దివంగత నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్య నారాయణ పార్టీలో అవమానాలు ఎదుర్కొన్నారని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు కనీసం పరామర్శించేందుకు కూడా టీడీపీ అధినేత రాలేదని ఆమె విమర్శించారు.

నా భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నారు

తన భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే, స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారని, విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెలను కూడా ధ్వంసం చేశారని గుండ లక్ష్మీదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని,అందుకే ఎంతో బాధతో పార్టీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించినా పార్టీలోనే కొనసాగామని, అయినా తమను దూరం పెట్టారని అన్నారు.

మేయర్ పదవిని ఆమె ఆశిస్తే..జనసేనకు కేటాయించారు

ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవిని ఆమె ఆశించగా, పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో పరిణామాలు వేగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైసీపీ నేతలు ఆమెను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం.

మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానన్న లక్ష్మీదేవి

కూటమి పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని, వారికి మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానని లక్ష్మీదేవి తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో పనిచేశానని, వైసీపీలో కూడా జగన్ నాయకత్వంలో అదే నిబద్ధతతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు

19వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు, ఉద్యమానికి శాస్త్రవేత్తల మద్దతు!

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 22 (జర్నలిస్ట్ డైరీ) :
సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న మన రిలే నిరాహార దీక్షకు 19వ రోజు కు చేరుకున్నాయి. ఈ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు మద్దతు తెలపడం ఉద్యమానికి మరింత బలాన్ని ఇచ్చింది, ఈ రిలే నిరాహార దీక్షలకు జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ, రాజేంద్రనగర్ సైంటిస్ట్ డాక్టర్ వెంకటేష్, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మణ్, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, యంగ్ ప్రొఫెషనల్స్ కల్యాణి, మహేష్ రెడ్డి, స్నేహిత రెడ్డి లు మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణం, పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేసిన పరిశోధకులు, శాస్త్రవేత్తలు. ఇది కేవలం ఒక డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం కాదని, మన నేల కోసం, మన నీటి కోసం, మన గాలి కోసం, రైతుల భవిష్యత్తు కోసం, రాబోయే తరాల ఆరోగ్యం కోసం సాగుతున్న ప్రజా ఉద్యమం అన్నారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని విస్మరించకూడదు. ప్రజల ఆరోగ్యం, ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC) సిద్దాపూర్ గ్రామ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బాధితులు.. ప్రజా ఉద్యమానికి ప్రజలంతా కదలిరండి...

- నేడు జవహర్ నగర్ డంపింగ్ యార్డు తరలింపు ఉద్యమ కార్యాచరణ, పాదయాత్ర సన్నాహక సమావేశం

నాగారం, అక్టోబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ)
జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న బాధిత ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఐక్యంగా ముందుకు రావాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గురువారం ఒక సందేశం లో పిలుపునిచ్చారు.
ఈ నెల 23న శుక్రవారం ఉదయం 10:00 గంటలకు సాయి భవాని ఫంక్షన్ హాల్, దమ్మాయిగూడ 4వ డివిజన్ లో జరుగుతుందని తెలిపారు. డంపింగ్ యార్డు తరలింపే లక్ష్యంగా రౌండ్ టేబుల్ సమావేశం, పాదయాత్ర కార్యాచరణపై కీలక చర్చ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం మనమంతా ఒక్కటై ఉద్యమాన్ని బలోపేతం చేద్దామని
మన సమస్య -- మన పోరాటం -- మన విజయంగా భావించాలని కోరారు. కావున డంపింగ్ యార్డు బాధిత ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలందరూ తప్పనిసరిగా హాజరై ఈ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేసారు.
సమావేశం అనంతరం మధ్యాహ్న భోజన సదుపాయం ఉన్నట్లు నిర్వహకులు ఈ సందర్భంగా రామక్కపేట రవీందర్ రెడ్డి బిజెపి మేడ్చల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం....

నాగారం, అక్టోబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ)
కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు ముఖ్య అతిథిగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, పారిజాత నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందముల పరమేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గారిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే ప్రతి పట్టభద్రుడు వెంటనే తన ఓటును నమోదు చేసుకుని, కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఏపీ 'సీఎస్' సాయిప్రసాద్ పదవీకాలం పొడిగింపు.. చంద్రబాబు విజ్ఞప్తికి కేంద్రం ఓకే

-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పదవీకాలాన్ని పొడిగించిన కేంద్రం

-రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆరు నెలల పాటు సర్వీస్ పొడిగింపు

-2027 మే 31వ తేదీ వరకు సీఎస్‌గా కొనసాగనున్న సాయి ప్రసాద్

-స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం

-కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన 2027 మే 31వ తేదీ వరకు ఇదే హోదాలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పరిపాలనా సౌలభ్యం కోసం సీఎస్ పదవీకాలాన్ని పొడిగించాలని చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది.
1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన గోపీకృష్ణ సాయిప్రసాద్ ఈ ఏడాది నవంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిపాలనాపరమైన అవసరాలు, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఆయన సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 29న కేంద్రానికి ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపింది.

పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు

ఈ ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, ఆల్ ఇండియా సర్వీసెస్ నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక మినహాయింపులు ఇచ్చింది. డెత్-కమ్-రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూల్స్, 1958లోని రూల్ 16(1)కి సడలింపునిస్తూ, క్యాడర్ రూల్స్, 1960లోని రూల్ 3 ప్రకారం ఈ పొడిగింపును మంజూరు చేసింది. డిసెంబర్ 1, 2026 నుంచి మే 31, 2027 వరకు ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తున్నట్లు కేంద్ర అండర్ సెక్రటరీ రాజేశ్ కుమార్ యాదవ్ సంతకంతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వుల కాపీలను ప్రధానమంత్రి కార్యాలయం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం సహా సంబంధిత శాఖలకు పంపించారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కొనసాగింపు

ఈ నిర్ణయంతో, కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పరిపాలనలో అనుభవజ్ఞుడైన అధికారి కొనసాగేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి సాయి ప్రసాద్ నాయకత్వం అందించడం ద్వారా పరిపాలనలో స్థిరత్వం, కొనసాగింపు ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది

పవన్ కల్యాణ్ రాజీనామా అంటూ వాట్సాప్‌లో తప్పుడు ప్రచారం... చర్యల భయంతో బహిరంగ క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్

-పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్...సైబర్ చర్యల హెచ్చరికతో క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్

-సోషల్ మీడియాలో చూసి, నిర్ధారించుకోకుండా షేర్ చేశానని వెల్లడి

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు.

తీవ్రంగా స్పందించిన డిప్యూటీ సీఎం కార్యాలయం

అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. "డిప్యూటీ సీఎంఓ, ఆంధ్రప్రదేశ్" పేరుతో నడుస్తున్న ఫేక్ వాట్సాప్ ఛానెల్‌పై, ఇతర తప్పుడు ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ అధికారిక హెచ్చరికల నేపథ్యంలోనే వాట్సాప్ అడ్మిన్ క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది

ఏపీకి మరో తుపాను ముప్పు? బంగాళాఖాతంలో అనుకూల పరిస్థితులు!

-బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ

-అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు

-శుక్రవారం నాటికి అల్పపీడనం గా మారే అవకాశం

-పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా

-తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు

-భారత వాతావరణ శాఖ హెచ్చరిక



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

శుక్రవారం నాటికి ఆగ్నేయ, తూర్పుమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం...

పూర్తి వివరాల్లోకి వెళితే... అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు.

తుపానుగా మారే అవకాశాలు ఎంత?

సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగుండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు.
ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఏపీలో పరిషత్ నామినేషన్ల వేళ రణరంగం..
పలుచోట్ల ఘర్షణలు, గాల్లోకి కాల్పులు

-ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు

-కడప జిల్లా నందలూరులో టీడీపీ వర్గాల మధ్య రాళ్లదాడి, గాల్లోకి కాల్పులు

-కనిగిరి, యర్రగొండపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

-శాంతిభద్రతల దృష్ట్యా కడపలో పలువురు వైసీపీ నేతల అరెస్ట్

-ఘర్షణల్లో వాహనాలకు నిప్పు, -పలుచోట్ల పోలీసుల లాఠీఛార్జ్

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : రాష్ట్రంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ హింసాత్మకంగా మారింది. గురువారం పలు జిల్లాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఘర్షణలు చోటు చేసుకోగా, మరికొన్ని చోట్ల అంతర్గత వర్గపోరు భగ్గుమంది. రాళ్ల దాడులు, వాహనాలకు నిప్పు పెట్టడం, గాల్లోకి కాల్పులు జరపడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే...

కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం లోని నందలూరులో పరిస్థితి అదుపు తప్పింది. టీడీపీలోని రెండు వర్గాలు తమ అభ్యర్థులే నామినేషన్ వేయాలని పట్టుబట్టడంతో వివాదం చెలరేగింది. టీడీపీ అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, మరో నేత విజయసాగర్ వర్గీయుల మధ్య మొదలైన వాగ్వాదం తీవ్ర ఘర్షణకు, రాళ్ల దాడికి దారి తీసింది. ఈ ఘటనలో ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆగ్రహంతో ఓ కారుకు నిప్పు పెట్టారు. ఈ క్రమంలో బాలసుబ్రమణ్యం గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

మార్కాపురం జిల్లాలో...
మరోవైపు, మార్కాపురం జిల్లా కనిగిరిలో నామినేషన్ల కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరినే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి యత్నించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం ఏర్పడింది. యర్రగొండపాలెంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తోపులాట జరగగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

కడప జిల్లాలో ముందస్తు చర్యలు
ఇక కడప జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ మంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి అట్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది

పొదిలిలో నామినేషన్ల వివాదం..
రోడ్డెక్కిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు!

-అభ్యర్థులను అడ్డుకుని, నామినేషన్ పత్రాలు చించివేసి, దాడులకు పాల్పడ్డారని ఆరోపణలు

-నామినేషన్‌కు వచ్చిన మహిళపై బ్లేడ్‌తో దాడి చేశారని ఆవేదన..

-అభ్యర్థులకు పోలీసు భద్రత కల్పించాలని అన్నా డిమాండ్

-ఒంగోలు--కర్నూలు రహదారిపై బైఠాయించి వైసీపీ శ్రేణులు రాస్తారోకో

-గంటకు పైగా నిలిచిపోయిన వాహనాలు

పొదిలి, మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : మండల పరిషత్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో మార్కాపురం జిల్లా పొదిలి పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చించివేసి దాడులకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆరోపించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శిస్తూ ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు.
నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన మహిళపై బ్లేడ్‌తో దాడి చేశారని అన్నా రాంబాబునామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన మహిళపై బ్లేడ్‌తో దాడి చేశారని అన్నా రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తన కళ్లెదుటే ఘటనలు జరుగుతున్నా పోలీసులు తగిన విధంగా స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. కొనకనమిట్ల లోనూ..ఇదే పరిస్థితి...
మరోవైపు కొనకనమిట్ల లోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేసే సమయంలోనే అభ్యర్థులకు రక్షణ లేకపోతే ప్రజాస్వామ్యానికి భద్రత ఎక్కడ ఉంటుందని ఆయన నిలదీశారు.
పొదిలిలో ఒంగోలు--కర్నూలు రహదారిపై బైఠాయించి రాస్తారోకో
వైఎస్సార్సీపీ అభ్యర్థులు, నాయకులు సమూహంగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు అనుమతించాలని, లేనిపక్షంలో నామినేషన్లు వేసి తిరిగి వచ్చే వరకు పోలీసు భద్రత కల్పించాలని అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పొదిలి లోని విశ్వనాధపురం సెంటర్ లో ఒంగోలు--కర్నూలు ప్రధాన రహదారిపై వైసీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు.
నిలిచిపోయిన ట్రాఫిక్...
దీంతో ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటకు పైగా రహదారిపై నిరసన కొనసాగడంతో పొదిలిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
నిబంధనల ప్రకారమే అనుమతులు..ఎస్సై సూరెడ్డి రాజేష్
ఆందోళన నేపథ్యంలో ఎస్సై సూరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నాయకులతో చర్చలు జరిపారు. నామినేషన్ కేంద్రం వద్ద ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అనుమతులు ఉంటాయని, నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించాలని ఎస్సై స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే అభ్యర్థులు ఎలాంటి అవరోధాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేలా భద్రత కల్పించాలని వైఎస్సార్సీపీ నాయకులు పట్టుబట్టారు.
అభ్యర్థులకు భద్రత కల్పించాలి
నామినేషన్ల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించివేయడం, దాడులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి అభ్యర్థికీ తగిన పోలీసు రక్షణ కల్పించాలని, నామినేషన్ హక్కును ఎవరూ అడ్డుకోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న ఈ ఘటనలతో సర్వత్రా ఏం జరుగుతోందని ఒకింత ఉత్కంఠ నెలకొంది.

తెలంగాణ దేశీ విప్లవ వీరుడు పండుగోల్ల సాయన్న....

-ఎల్బీనగర్లో పండుగ సాయన్న 174 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన బీసీఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సీతా మహాలక్ష్మి ముదిరాజ్..

జర్నలిస్టు డైరీ, ఎల్బీనగర్: పండుగ సాయన్న తెలంగాణలోని పాలమూరు ప్రాంతంలో పేదలు, అణగారిన ప్రజల కోసం పోరాడిన జానపద ప్రజావీరుడిగా ప్రసిద్ధి చెందారని బీసీఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లింగన్న బోయిన సీతా మహాలక్ష్మి అన్నారు. గురువారం ఎల్బీనగర్లో పండుగ సాయన్న 174వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఆమె మాట్లాడుతూ సంపన్న భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌ల దోపిడీని ఎదిరించి, పేదలకు సహాయం చేసిన వ్యక్తిగా ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిరని అన్నారు.
అందుకే ఆయనను "తెలంగాణ రాబిన్‌హుడ్" అని పిలుస్తారు.మల్లయోదుడు బుజబలం కండబలం కలిగిన సాయన్న ఆయన కాలంలో కరువు తాండవం చేస్తున్న కాలంలో వెలిసిన సాయన్న ప్రజా సైన్యం నిర్మాణం చేసి కరువు దాడులు చేసి పేదల పక్షాన నిలబడినాడు.
రాష్ట్ర ప్రభుత్వము అధికారికంగా పాపన్న జయంతి వర్ధంతిలను నిర్వహించాలి.
మరియు ట్యాంక్ బండ్ పైన పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
ముదిరాజ్ కులాన్ని బి నుండి ఎ లోకి మార్చాలి. పండుగ సాయన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి.
ఈ కార్యక్రమంలో బీసీ ఎస్ ఫ్ రాష్ట్ర అధ్యక్షులుడు ఎల్బీనగర్ విగ్రహ కమిటీ అధ్యక్షులు గుంటి కురుమూర్తి ముదిరాజ్ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్.,బీసీ ఎస్ ఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గద్దె రత్నకుమారి ముదిరాజ్, ఎల్బీనగర్ విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షులు మాసుల నర్సింగ్ రావు ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు బోయపల్లి లింగస్వామి గౌడ్ ఎల్ బి నగర్ విగ్రహ కమిటీ కార్యదర్శి సందుల కృష్ణ ముదిరాజ్ గారు

నాచారం ఈఎస్ఐ హాస్పిటల్ లో కార్మికుల నిరసన....

నాగారం, అక్టోబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ) గత నాలుగు నెలలు గా కార్మికులకు జీత బత్యాలు చెల్లించకపోవడం తో నిరసన చేపడుతున్న ఈఎస్ఐ హాస్పిటల్ కార్మికులు గురువారం నిరసన తెలిపారు. కార్మికుల ధర్నాకు ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి తోకల సత్య ప్రసాద్ మద్దతు తెలియజేస్తూ మాట్లాడుతూ పోరాడుతాం కార్మికుల జీతాలు ఇచ్చేంతవరకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కోదాడ తెలుగుదేశం పార్టీ వార్డు సమన్వయ కమిటీల నియామకం...

నాగారం, అక్టోబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ) కోదాడ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ అధ్యక్షుడు కట్టా సతీష్ మరియు ప్రధాన కార్యదర్శులు సంపేట బాలకృష్ణ, ముఖ్య అతిథులుగా నియోజకవర్గం మాజీ ఇంచార్జి ఓరుగంటి ప్రభాకర్ చిలుకూరు మండల మాజీ అధ్యక్షులు సాతులూరు సీనియర్ నాయకులు కోదాటి గురవయ్య సమక్షంలో, కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎస్ నగర్ 12వ వార్డు తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీలను కార్యకర్తల సమక్షంలో నియమించడం జరిగింది. 12వ వార్డు సమన్వయ కమిటీ: అధ్యక్షుడుగా కందుల అనిల్,ఉపాధ్యక్షుడుగా మరలగాని చందర్ రావు, కార్యదర్శిగా గద్దె అప్పారావు,సహాయ కార్యదర్శిగా పెద్దబొయ్యిన రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ గురవయ్య, కొల్లు చంద్రరావు, జి. ఉపేందర్, కోదాడ రేవంత్ రెడ్డి, రాయబరపు ఆశిష్, గద్దె అప్పారావు, కె వీరబాబు, ఎస్ బాలకృష్ణ, జి నవీన్ పి రమేష్, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన వార్డు సమన్వయ కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం పాదయాత్రకు సన్నాహక సమావేశం

నాగారం, అక్టోబర్ 22:-(జర్నలిస్ట్ డైరీ) దమ్మాయిగూడ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం, డంపింగ్ యార్డ్ తొలగింపు డిమాండ్‌తో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శ్రీ ఈటల రాజేందర్ గారు తలపెట్టిన పాదయాత్రకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ వర్గాలు వెల్లడించాయి.
ఈ సమావేశం శుక్రవారం ఉదయం 10:00 గంటలకు దమ్మాయిగూడలోని సాయి భవాని ఫంక్షన్ హాల్లో నిర్వహించబడుతుందని వారు తెలిపారు.
దమ్మాయిగూడ డంపింగ్ యార్డ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిసర ప్రాంతాల ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయడానికి కార్యాచరణ రూపొందించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.కావున భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల బాధితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఈ సన్నాహక సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాము.ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, దమ్మాయిగూడ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీమేడ్చల్ రూరల్ జిల్లా నాయకులు తెలిపారు.

ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

-జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఆర్.వో.లు, వివిధ విభాగాల నోడల్ ఆఫీసర్లతో గురువారం ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పిటిసి ఎంపిటిసి లకు రేపు కూడా నామినేషన్లు ప్రక్రియ ఉన్నందున నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు లోబడి నామినేషన్ వేసే వారితోపాటు ఇద్దరిని అనుమతించాలని నిర్ణీత గడువు లోపల ఉన్న వారిని నామినేషన్ వేసే లాగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, బ్యాలెట్ బాక్స్ ల భద్రత, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామాగ్రి సమకూర్చుకోవడంలో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, వి.ఎస్.టి, వి.వి.టి. బృందాలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యం. పాత ఒప్పందాలను వేగవంతం చేయాలి..సీఎం చంద్రబాబు

-సీఎం చంద్రబాబు అధ్యక్షతన 22 వ ఎస్ఐపిబి సమావేశం
-గత ఒప్పందాలను ఉత్పత్తి దశకు తేవాలని సీఎం ఆదేశం
-రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి
-714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులు ప్రారంభమైనట్లు వెల్లడి
-పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానంపై సీఎం దిశా నిర్దేశం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి 22వ సమావేశం జరిగింది. గతంలో కుదిరిన ఒప్పందాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, వాటిని పెట్టుబడులుగా మార్చి ఉత్పత్తి ప్రారంభించడంపై దృష్టి సారించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, పీ నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలపై బోర్డు చర్చించింది. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న 714 ఒప్పందాలకు గాను, 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ మొదలైందని అధికారులు సీఎంకు వివరించారు.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...
ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. దీంతో పాటు పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేయాలని స్పష్టం చేశారు

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి.

జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్:
గుర్తు తెలియని మహిళ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ ఎస్ఐ శృతి తెలిపిన వివరాల ప్రకారం. ఈనెల 08వ తేదీన. గత ముదు రోజుల క్రితం ఎల్బీనగర్ కామినేని ఫ్లైఓవర్ మీద ఒక గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి ఎల్బీనగర్ పోలీస్లకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేసుకుని అపస్మారక స్థితిలో పడి పోయిన మహిళ వయస్సు (45) ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లబించలేదు. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్కు తరలించారు. ఈ క్రమంలో మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

406 - మృతి చెందిన గుర్తు తెలియని మహిళ...

చిట్టిగిద్దలో అర్ధరాత్రి విద్యుత్ వైర్ల చోరీ

25 నుంచి 30 బోరు బావుల వైర్లు దగ్ధం.. వెండి తీగల అపహరణ!

చిట్టిగిద్ద, అక్టోబర్ 22, 2026:
చిట్టిగిద్ద గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో అర్ధరాత్రి విద్యుత్ వైర్ల చోరీ జరిగినట్లు రైతులు తెలిపారు. సుమారు 25 నుంచి 30 బోరు బావులకు సంబంధించిన విద్యుత్ వైర్లను దుండగులు కాల్చివేసి, వాటిలోని వెండి తీగలను మాత్రమే తీసుకెళ్లినట్లు సమాచారం.ముఖ్యంగా సాలొళ్ల అనంతయ్యకు చెందిన నిమ్మ తోటలోని విద్యుత్ వైర్లను పూర్తిగా కాల్చివేసి, వాటిలో ఉన్న వెండి తీగలను దొంగిలించినట్లు బాధితులు తెలిపారు. ఘటనాస్థలంలో కాలిపోయిన వైర్లు, తీగలు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని ఫొటోలు ద్వారా గమనించవచ్చు.
ఈ ఘటనతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లింది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సదుపాయాలకు నష్టం కలగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి, దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దుర్గామాత చల్లని దీవెన నియోజకవర్గ ప్రజలపై ఉండాలి: ఎమ్మెల్యే బాలు నాయక్

మార్కండేయ స్వామి ఆలయంలో అమ్మవారి చీరల వేలంపాటలో పాల్గొన్న ఎమ్మెల్యే

దేవరకొండ, అక్టోబర్ 22 జర్నలిస్ట్ డైరీ :
దేవరకొండ పట్టణంలోని నాలుగో వార్డులో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని ఎమ్మెల్యే బాలు నాయక్ భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం దేవరకొండ పట్టణ పరిధిలోని మార్కండేయ స్వామి వారి ఆలయంలో కొలువుదీరిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన చీరల వేలంపాట కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో దేవరకొండ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పున్న శైలజ వెంకటేశ్వర్లు, మహ్మద్ రయీస్, మారుపాకుల సురేష్ గౌడ్, జింకల లింగయ్య, జింకల మధు, వనం నర్సింహా, జింకల మల్లయ్య, అన్నపూరి ఇస్తారి, మారుపల్లి కొండయ్య, జింకల చిన్న లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత, భద్రతలో అమిత్ షా కృషి ప్రశంసనీయం

బీజేపీ రాష్ట్ర నాయకుడు అనంతుల మహేష్ గౌడ్ జన్మదిన శుభాకాంక్షలు

చింతపల్లి, అక్టోబర్ 22 జర్నలిస్ట్ డైరీ :
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర సామాజిక కార్యవర్గ సభ్యుడు అనంతుల మహేష్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, అంతర్గత భద్రత పరిరక్షణలో అమిత్ షా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అమిత్ షా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింతకాలం సేవలందిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఘన నివాళులు

జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్



మిడ్జిల్, అక్టోబర్ 22, జర్నలిస్ట్ డైరీ :
తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పండుగ సాయన్న ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం మెరుగోనిపల్లి గ్రామంలో జన్మించిన పాలమూరు ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలిచి, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. సంపన్నుల నుంచి సంపదను సేకరించి పేదలకు పంచిపెట్టిన వ్యక్తిగా ఆయనకు తెలంగాణ రాబిన్‌హుడ్ అనే పేరు వచ్చిందన్నారు. సొంత ప్రాంతమైన పాలమూరు జిల్లాకు చెందిన ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం, వారి ఆశయాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఓ రుక్మిణి భాయ్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మోతిరామ్, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రారంలో ఘనంగా శ్రీ దుర్గాదేవి శోభాయాత్ర

భజన సంకీర్తనలు, ఆటపాటలతో వైభవంగా అమ్మవారి ఊరేగింపు



పటాన్‌చెరు, అక్టోబర్ 22 జర్నలిస్ట్ డైరీ :
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గ్రామంలో విజయదశమి సందర్భంగా శ్రీ దుర్గాదేవి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ విశేష అలంకరణలతో పూజించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దుర్గామాతను దర్శించుకున్నారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన శోభాయాత్ర భజన సంకీర్తనలు, ఆటపాటల నడుమ భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది. అమ్మవారి నామస్మరణతో రుద్రారం గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య యువజన సంఘం సభ్యులు, మాజీ సర్పంచ్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ను ఢీకొట్టిన కారు.. దంపతులకు తీవ్ర గాయాలు..

జర్నలిస్ట్ డైరీ ఎల్బీనగర్:
ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యా భర్తలను వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టిన సంఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న దంపతులిద్దరికీ తీవ్రగాయాలు అయిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, నాంపల్లికి చెందిన గుర్రం శత్రుజ్ఞ, అతని భార్య లక్షితో కలిసి గత కొన్ని రోజుల క్రితం కొత్తపేట విజయపురి కాలనీలో నివాసం ఉండే కుమారుడు గౌతమ్ వద్దకు వచ్చారు. ఈనెల 19న భార్య భర్తలు ఇద్దరు సాయంత్రం సమయంలో ద్విచక్ర వాహనం పై వైద్య పరీక్షల కోసం హస్తినాపురంలో ఉండే మమత హాస్పిటల్కు వెళ్తున్నారు. ఎల్బీనగర్ డీవీఎం కాలేజీ వద్ద రాగానే కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి వీరి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టారు. దీంతో ఇద్దరు కింద పడిపోయి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్ మమత హాస్పిటల్ కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించిగా శత్రుజ్ఞకు తల భాగంలో గాయమై మొదడులో రక్తపు గడ్డ ఏర్పడిందని. శరీరంలో ఇతర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాని తెలిపారు. ఈ ప్రమాదంలో లక్ష్మికి గాయాలయ్యని తెలిపారు. ఈ మేరకు వారి కుమారుడు గౌతమ్ ఇచ్చిన పిర్యాదు మేరకు ఎల్బీనగర్ రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్త చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటించాలి

లాటరీ పద్ధతిలోనే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలి: బీఆర్ఎస్ ఎమ్మెల్యేల డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 22 జర్నలిస్ట్ డైరీ :
హైదరాబాద్ మహానగర పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలను అరికట్టి, నిజమైన పేదలకు న్యాయం జరిగేలా పారదర్శకమైన లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, మహేశ్వరం, అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు తమ తమ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలను ప్రత్యేక కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల కేటాయింపుల్లో అర్హులైన పేదలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, మంత్రులు, అధికారుల సిఫారసుల ఆధారంగా లాటరీ విధానాన్ని అనుసరించకుండా ఇష్టానుసారంగా కేటాయింపులు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా అధికారికి చూపించినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గాల్లో ఇళ్ల కేటాయింపుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రభావానికి, ఇందిరమ్మ కమిటీల నిర్ణయాలకు వదిలివేయడం వల్ల నిజమైన పేదలకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. రాజకీయ సిఫారసులకు తావులేకుండా, అర్హతలను ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. నిజమైన పేదలకు దక్కాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అక్రమంగా ఇతరులకు కేటాయిస్తే సహించేది లేదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేటాయింపుల్లో అక్రమాలు కొనసాగితే దరఖాస్తుదారులతో కలిసి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465